సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



సోమశిలలో 53.961 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 53.961 టీఎంసీలు ఉన్నాయి. 6,900 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దక్షిణ కాలువకు 10 వేలు, పెన్నాడెల్టాకు 1000, ఉత్తరకాలువకు 540 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,890
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,066
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,278
సవర (8 గ్రాములు)	రూ.58,224

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.4 /26.6

మంగళవారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో సోమవారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ



గంగాభవాని

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బి.గంగాభవాని సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ ఓ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బంది కృషితో ప్రజా సంక్షేమానికి తమ శాఖ తరఫున శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. శాఖాపరమైన పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు అపార్ కార్డులు

- 14వ తేదీలోపు వివరాలు సేకరించండి

నెల్లూరు (టౌన్): జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ యాజమాన్యాలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ కార్డు తరహాలో 12 అంకెలతో కూడిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)కార్డులు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఈ నెల 14వ తేదీలోపు తల్లిదండ్రుల ద్వారా సేకరించాలని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఫొటో, క్యూఆర్ కోడ్‌తో ఐడీ కార్డు క్రియేట్ చేసి ఉంటుందన్నారు. విద్యార్థుల అకడమిక్ సమాచారం, ప్రోగ్రెస్ వివరాలన్ని ఈ కార్డులో ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థికి దసరా సెలవుల అనంతరం ఈ వివరాలను ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్ లాగిన్ ద్వారా యూడైస్‌లో నమోదు చేయాలన్నారు.

జిల్లాలో నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 3,11,913 మంది లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, డప్పు కళాకారులు తదితర 27 కేటగిరీల్లోని లబ్ధిదారులకు రూ.131,89,20,500 పంపిణీ చేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ ఇవ్వడం జరుగుతుందని సాంబశివారెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

టెట్ అభ్యర్థులకు 'పరీక్ష'

- డీఈఓ కార్యాలయంలో సమాధానం కరువు

నెల్లూరు (టౌన్): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)కు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు చుక్కలు చూపిస్తున్నారు. జిల్లా నుంచి టెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు బెంగళూరు, చిత్తూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో కేంద్రాలను కేటాయించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రతి రోజు రెండు విడతల ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. అయితే కోవూరుకు చెందిన ఓ మహిళా అభ్యర్థి టెట్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈమెకు చిత్తూరులో కేంద్రాన్ని కేటాయించారు. ఆమె చంటిబిడ్డ తల్లిని తెలిసింది. చిత్తూరు నుంచి నెల్లూరుకు మార్చుకునేందుకు ఆమె తండ్రి వారం రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌లో అర్జీ పెట్టుకుని వివరాలను అందజేశారు. అయితే సోమవారం వచ్చి సంబంధిత సెక్షన్ ఉద్యోగిని సంప్రదించగా డీఈఓను కలవాలని సలహా ఇచ్చారు. డీఈఓ రామారావు విజయవాడలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. మూడు రోజుల్లో టెట్ ప్రారంభం కానుండడంతో వారిలో టెన్షన్ మొదలైంది. ఈ రీతిలో జిల్లాలోని చాలా మంది అభ్యర్థులకు ఇతర రాష్ట్రాలు, జిల్లాలు కేటాయించడంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.

కార్యాలయంలో సమాచారం కరువు

జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పనుల మీద వచ్చే వారికి అక్కడ సమాచారం చెప్పే వారు కరవయ్యారు. డీఈఓ రామారావు బదిలీపై వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. దీంతో అక్కడ అధికారులు, ఉద్యోగుల ఇష్టారాజ్యంగా మారింది. ఏ పని మీద వచ్చినా డీఈఓను కలవాలని సలహా ఇస్తున్నారు. డీఈఓ దొరకని పరిస్థితి. దీంతో కార్యాలయ ప్రాంగణంలోనే గంటల తరబడి వేచి చూసి నిరాశగా వెళ్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా డీఈఓ కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఇటు ఉపాధ్యాయులతో పాటు అటు టెట్ అభ్యర్థులు కోరుతున్నారు.

సొంతిల్లు.. ఆశలపై నీళ్లు

మార్చిలోపు పూర్తి చేయాలని షరతులు

- ఆందోళనలో లబ్ధిదారులు
- ప్రభుత్వం నుంచి కనిపించని ఆదరణ
- మన ఇల్లు.. మన గౌరవం పేరుతో కూటమి హంగామా

పేదల సొంతింటి ఆశలను నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తే.. కూటమి ప్రభుత్వం షరతులు విధించి ఆశలపై నీళ్లు కుమ్మరించింది. ఇప్పటికే ప్రారంభించిన ఇళ్లను మార్చి లోపు పూర్తి చేయాలని షరతులు విధించిన ప్రభుత్వం వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పురోగతిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇంకా ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను పూర్తిగా నిలిపివేసింది. కొత్త వాటి మంజూరు ఊసే పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ పరంగా సాయం అందించకపోగా, మన ఇల్లు..మన గౌరవం పేరుతో హంగామా చేస్తోంది.

ఉదయగిరి: సొంతింటి కల నెరవేరుతుందని ఎంతో ఆశతో ఉన్న జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను మార్చిలోపు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం విధించిన షరతులు లబ్ధిదారుల గుండెల్లో గుబుళ్లు రేపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 983 లేఅవుట్లు ఏర్పాటు చేసి 98,750 ఇళ్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలు బ్యాంకు రుణం ఇప్పించేలా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇచ్చే సహాయంతో పాటు లబ్ధిదారులు మరికొంత నగదు సమకూర్చుకుంటే సొంతిల్లు నిర్మించుకునేలా ప్రణాళికలు రూపొందించింది. దీంతో వేలాది మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అప్పట్లో లేఅవుట్లు ఏర్పాటు చేయడంలో జాప్యం, లబ్ధిదారులు సకాలంలో స్పందించకపోవడం వంటి కారణాలతో ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరిగింది.

జగనన్న కాలనీల్లో సకల వసతులు

జగనన్న కాలనీల్లో అప్పటి ప్రభుత్వం పలు వసతులు కల్పించింది. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించింది. కొన్ని చోట్ల గ్రావెల్‌తో అంతర్గత రోడ్లు కూడా వేసింది. సీసీ రోడ్లు వేసే సమయంలో ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. అనేక కాలనీల్లో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేసింది.

కూటమి ప్రభుత్వం షరతులు

చంద్రబాబు గత పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు, ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విస్తృతంగా ప్రత్యేకంగా ప్రైవేట్ లేఅవుట్లను తలపించేలా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై పలు ఆంక్షలు విధిస్తోంది. వచ్చే మార్చి లోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని షరతు పెట్టింది. ఇప్పటి వరకు ప్రారంభించని ఇళ్ల నిర్మాణం నిలిపివేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కొలువు దీరి వంద రోజులు గడిచినా కొత్త ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభించలేదు. పైగా ఆర్థిక పరిస్థితి బాగా లేదని సాకు చూపుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసే పన్నాగాలు పన్నుతోంది.



వింజమూరులో హైవేపై ఉన్న లేఅవుట్లలో వివిధ దశల్లో ఇళ్లు



మన ఇల్లు - మన ప్రభుత్వం హంగామా

కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పని చేయకుండా కాలయాపన పనులు చేపడుతోంది. అయితే 'మన ఇల్లు-మన ప్రభుత్వం' అనే నినాదంతో లేఅవుట్లు దగ్గర లబ్ధిదారులు, అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రతి శనివారం సమావేశాలు ఏర్పాటు చేయడంపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ఎలాంటి ఆర్థిక ప్రయోజనం కల్పించకుండా ఈ సమావేశాలు ఎందుకుని పలువురు లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు. మార్చిలోపు కట్టుకోకపోతే ఇళ్లు రద్దు చేస్తామని చెబుతున్నారంటూ పలువురు వాపోయారు.

జిల్లాలో లేఅవుట్లు	983
మంజూరైన ఇళ్లు	98,750
పూర్తయిన ఇళ్లు	24,159
శ్లాబ్ స్థాయిలో..	13,125
లెంటిల్ స్థాయిలో..	5,933
పునాది స్థాయిలో..	18,668
ప్లింత్ బీమ్ స్థాయిలో..	1,345
పునాది తీసి వదిలేసిన..	26,172
మొదలు పెట్టని ఇళ్లు	9,348

కనుల పండువగా గంధ మహోత్సవం



కసుమూరులోని చందన్ మహల్ నుంచి గుర్రంపై గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న మత పెద్దలు



కసుమూరు దర్గాలో కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్ ప్రార్థనలు చేస్తున్న దృశ్యం, పక్కన ఏఆర్ రెహమాన్

వెంకటాచలం: దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలి దర్గా 247వ గంధ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. దర్గాకు కి.మీ. దూరంలో ఉన్న చందన్ మహల్ నుంచి ఆదివారం అర్ధరాత్రి గుర్రంపై గంధాన్ని మేళ తాళాల మధ్య వైభవంగా ఊరేగించారు. సోమవారం ఉదయం 6 గంటలకు దర్గా వద్దకు గంధాన్ని తీసుకువచ్చారు. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ మస్తాన్‌వలీ సమాధిపై చద్దర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గంధం బిందెను దర్గా ముజావర్లు చేతికి అందజేశారు. గంధంను ముజావర్లు భక్తులకు పంపిణీ చేశారు. గంధ మహోత్సవానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దర్గాను దర్శించుకునే భక్తుల మధ్య ఎలాంటి తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

దర్గాను సందర్శించిన ఏఆర్ రెహమాన్

ప్రముఖ సంగీత దర్శకులు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సోమవారం కసుమూరు దర్గాను సందర్శించారు. ఆయనతో పాటుగా ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి దర్గాలో ప్రార్థనలు చేశారు.

తహలీల్, ఫాతేహా నేడు

మస్తాన్‌వలీ గంధ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తహలీల్, ఫాతేహా కార్యక్రమాలు నిర్వహిస్తారని దర్గా ముజావర్లు తెలిపారు.

ఏఎస్‌పేట దర్గాలో..

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో 251వ గంధమహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత మహల్ నుంచి గంధం డప్పు వాయిద్యాలు, కీర్తనలతో ఫకీర్ల జరాబులతో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. దర్గాలోని ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మ సమాధులకు గంధం లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధ ప్రసాదాన్ని పంచి పెట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో దర్గా ప్రాంతంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



దీపాలంకరణ

సోమవారం దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా దర్గాలోని కోనేటిమిట్ట మహిళలు దీపాలను వెలిగించి తమ భక్తి సామరస్యాన్ని చాటుకున్నారు. దర్గా వక్ఫ్‌బోర్డు ఈఓ హుస్సేన్ బావి వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

3న జిల్లా విజన్ ప్లాన్ వర్క్‌షాపు

నెల్లూరు (దర్గామిట్ట): స్వర్ణాంధ్ర -2047 జిల్లా, మండల విజన్ ప్రణాళికకు సంబంధించి అక్టోబర్ 3న నెల్లూరులో వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వరకస్తూర్బా కళాక్షేత్రంలో విజన్ ప్లాన్ వర్క్‌షాపు జరుగుతుందని, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని రైతు సంఘాలు, ఎన్‌జీఓలు, వ్యాపార వాణిజ్య సంఘాలు, విద్యావేత్తలు, ఆర్థిక వేత్తలు, ప్రముఖ వ్యక్తులు పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలిచ్చి రాబోయే 5 ఏళ్లకు జిల్లా విజన్ ప్రణాళిక తయారు చేయడానికి సహకరించాలని కోరారు.

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

నెల్లూరు(క్రైమ్): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలోని 16 మంది ఎస్సైలు, ఉమ్మడి జిల్లాలోని 22 మంది హెడ్ కానిస్టేబుల్స్, 155 మంది కానిస్టేబుల్స్‌ను బదిలీ చేస్తూ జిల్లా డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయింది. బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారం నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనుండడంతో అధికార పార్టీ నేతలు దుకాణాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. మద్యం వ్యాపారం సానుకూలంగా సాగాలంటే తాము చెప్పినట్లు వినే అధికారులు, సిబ్బంది ఉంటేనే సాధ్యమనే యోచనతో అనుకూలమైన అధికారులు, సిబ్బందిని తమ ప్రాంతాల్లోకి బదిలీ చేయించుకున్నట్లు సమాచారం. మరో వైపు కొన్ని ప్రాంతాల్లో తమకు తెలియకుండా దుకాణాలు ఏర్పాటు చేయరాదని ఇప్పటికే హుకుం జారీ చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆశావహులను గుర్తించి బెదిరింపు చర్యలకు పాల్పడుతోన్నట్లు తెలుస్తోంది.

ఎస్సై పేరు	బదిలీ అయిన ఎక్సైజ్ స్టేషన్	ఎస్సై పేరు	బదిలీ అయిన ఎక్సైజ్ స్టేషన్
ఎస్. ప్రభాకర్‌రావు	నెల్లూరు-1	ఎస్. రేవతి	కందుకూరు
జేకేవీఎస్ మురళీకృష్ణ	నెల్లూరు-1	ఎం. దేవిక	కావలి
డి. శ్రీధర్	నెల్లూరు-1	దీప్తిక్రాంత్	ఉదయగిరి
ఎస్. శకుంతలాదేవి	నెల్లూరు-2	ఎం. అంజయ్య	పొదలకూరు
ఎస్‌డీ మునీర్ అహ్మద్	నెల్లూరు-2	సీహెచ్ పూర్ణకుమార్	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
ఓ. ప్రతాప్‌కుమార్	కోవూరు	ఎస్‌డీ కాలేషావలీ	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
షేక్ మహబూబ్‌బాషా	కోవూరు	కేవీఆర్ ఆంజనేయులు	పీఅండ్‌ఈ ఎస్‌టీఎఫ్
కె. హరిబాబు	ఇందుకూరుపేట	ఎండీ ఆసీఫ్‌బేగ్	ఐఎంఎల్‌డిపో, దేవరపాళెం

విమానాశ్రయ భూ సమస్య కొలిక్కి!

- మరో 336.48 ఎకరాల సేకరణకు లైన్ క్లియర్
- పరిహారం చెల్లింపునకు నిధుల కోసం ప్రతిపాదనలు
- మరో 481 ఎకరాల అటవీ భూములపై కూడా దృష్టి

కావలి: దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి అడ్డంకిగా మారిన భూసమస్య కొలిక్కి వచ్చింది. వివాదాల్లో ఉన్న 336.48 ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి భూసేకరణ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు భూమికి ఎకరాకు రూ.18 లక్షలు, అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.13 లక్షలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించేలా నిధులు మంజూరు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇవి కాకుండా మరో 400 ఎకరాల అటవీశాఖ భూములను సేకరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 1,861.2 ఎకరాలు విమానాశ్రయానికి కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నారు. దామవరంలో నిర్మించే విమానాశ్రయంలో ఏడాదికి 5 లక్షలు మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారనే అంచనాతో అవసరమైన నిర్మాణాలు చేయనున్నారు. అయితే సరుకుల రవాణా చేసే కార్గో విమానాశ్రయంగానూ దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందుకే ప్రారంభంలోనే ఏడాదికి 50,000 టన్నుల సామర్థ్యం కలిగిన కార్గో సౌకర్యాన్ని విమానాశ్రయంలో నిర్మాణాలు చేసే విధంగా కార్యాచరణ చేస్తున్నారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం 1,323 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కావలి వద్ద నిర్మించనున్న విమానాశ్రయాన్ని 1379.71 ఎకరాలలో తొలుత నిర్మించనున్నారు. ఇందులో 1,051.09 ఎకరాలు భూసేకరణ పూర్తి చేయగా, మిగిలిన 336.48 ఎకరాల భూసేకరణకు సమస్యలు కొలిక్కి వచ్చాయి. వస్తు రవాణాలో దేశంలో న్యూఢిల్లీ, ముంబయి విమానాశ్రయాల తర్వాత మూడో అతి పెద్దది చెన్నై విమానాశ్రయం. ఏడాదికి 6.5 లక్షల టన్నుల సరుకులు ఎగుమతి దిగుమతులకు వసతులు ఉన్నాయి. 2025 తర్వాత 10 లక్షల టన్నులకు సామర్థ్యాన్ని పెంచుకోవాలని చెన్నై విమానాశ్రయ వర్గాలు వ్యాపార వ్యూహాలు సిద్ధం చేసుకొంటున్నాయి. స్థలాభావం వల్ల ఇరుకుతో చెన్నై విమానాశ్రయంలో ఎగుమతి, దిగుమతిదారులు అవస్థలు పడుతున్నారు. 2015 డిసెంబర్‌లో చెన్నై విమానాశ్రయం వరద నీటిలో మునిగిపోవడంతో కొద్ది రోజులు మూసేశారు. దీంతో జాతీయ, అంతర్జాతీయ వస్తు రవాణాదారులు తీవ్రంగా నష్టపోయారు. కార్గో హ్యాండ్లింగ్‌కు చెన్నై విమానాశ్రయంలో ఖర్చులు భారీగా ఉన్నాయి. ఈ క్రమంలో చెన్నైకి సమీపంలో జాతీయ రహదారిపై కావలి వద్ద నిర్మించనున్న విమానాశ్రయం కార్గోకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా నిర్మాణాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. చెన్నై, ఎన్నూరు నౌకాశ్రయాల నుంచి, జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుల నుంచి కూడా విదేశాలకు కార్గో విమానాలలో వస్తువులు ఎగుమతి చేయడానికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ల నుంచి సరుకులు ఎగుమతికి కూడా దగదర్తి విమానాశ్రయం అనువుగా ఉండనున్నది.



ఎయిర్ పోర్టు నిర్మాణానికి సేకరించిన భూమి



సూపర్ సిక్స్ ఎప్పుడిస్తావు బాబూ?

- హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా బాబు, పవన్ వ్యాఖ్యలు
- డీసీసీ అధ్యక్షుడు చేవూరు



నెల్లూరు (వీఆర్సీసెంటర్): గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు సిక్స్ పథకాల్లో ఒక్కటీ కూడా అమలు చేయలేదని, వంద రోజుల్లో కక్ష సాధింపు ధోరణి తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్ దుయ్యబట్టారు. నగరంలోని ఇందిరాభవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల గిరుశుడు వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రోడ్డు కీడ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందని మండిపడ్డారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుసరిస్తున్న ప్రవర్తన సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యులు తలారి బాలసుధాకర్, నాయకులు ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, అల్లావుద్దీన్, డాక్టర్ ప్రసాద్, సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.


ఈయన పేరు మదనపల్లి మధుసూదన్‌రావు. రక్తదాన మోటివేటర్. ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తుంటారు. ఓ పాజిటివ్ గ్రూపు కలిగిన ఈయన ఇప్పటికే 137 దఫాలుగా రక్తదానం చేశాడు.


ఈయన పేరు సీహెచ్ అజయ్‌బాబు. నెల్లూరులో నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పాక బ్లడ్‌బ్యాంక్‌కు వచ్చి సేవలందిస్తారు. ఏ పాజిటివ్ గ్రూపు కలిగిన ఈయన ఇప్పటి వరకు 107 సార్లు రక్తదానం చేశాడు. అనేక అవార్డులు వరించాయి.


ఈయన పేరు కుంచాల విజయ భాస్కర్. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్. నివాసం ధనలక్ష్మీపురం. గ్రామీణ యువతను స్వచ్ఛంద రక్తదానం వైపు మోటివేట్ చేయడంలో మేటి. ఇప్పటి వరకు 57 సార్లు రక్తదానం చేయడమే కాకుండా 28 క్యాంపులు నిర్వహించి నాలుగు వేల మందికిపైగా రక్తదానం చేసేలా ప్రోత్సహించాడు.


పలగాని కిరణ్‌కుమార్‌రెడ్డిది ఓ పాజిటివ్ గ్రూపు. ఈయన 98 సార్లు రక్తదానం చేశాడు. ఇంకా దగ్గుపాటి జీవన్‌కుమార్‌ది ఏ-పాజిటివ్ గ్రూపు. 94 సార్లు రక్తదానం చేశాడు.

- జిల్లాలో పెరుగుతున్న స్వచ్ఛంద దాతలు
- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్
- జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం నేడు

రక్తదాతలకు సలాం

సంవత్సరం	సేకరించిన యూనిట్లు	రోగులకు అందజేసిన యూనిట్లు
2021	15,383	26,529
2022	22,893	32,550
2023	15,555	30,162
2024	12,466	24,427

(ఇప్పటి వరకు)

నెల్లూరు(అర్బన్): ప్రమాదాల్లో గాయపడి తీవ్ర రక్తస్రావం జరిగిన వారికి, రక్తహీనతతో బాధపడుతున్న వారికి, తలసేమియా రోగులకు, తీవ్రమైన జబ్బుతో ఉన్నవారికి, ఆపరేషన్లు అవసరమైన వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. అలాంటి వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ప్రాణదాతలుగా నిలుస్తూ జిల్లాకు మంచి పేరు తెస్తున్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ ఒకటో తేదీన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ తరఫున రక్తదాన మోటివేటర్లకు అవార్డులు అందజేయనున్నారు.


ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్

కొరత తీర్చేందుకు..

జిల్లాలో బాధితులకు రక్తం అందించేందుకు పలు బ్లడ్‌బ్యాంక్‌లు పని చేస్తున్నాయి. అందులో రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన బ్లడ్‌బ్యాంక్ అత్యధికంగా బాధితులకు రక్తం అందిస్తోంది. ఇంకా నోవా బ్లడ్‌బ్యాంక్, ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్‌లు రోగులను ఆదుకుంటున్నాయి. అయినా ఒక్కో సీజన్‌లో రోగులకు రక్తం అందించడంలో కొరత ఏర్పడుతోందని బ్లడ్‌బ్యాంక్‌ల నిర్వాహకులు పేర్కొంటున్నారు. మరింత మంది ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరుతున్నారు.

దాతలకు వందనాలు


ఎంతో మంది స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. వారికి వందనాలు. డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు, వైరల్ ఫీవర్ సమయాల్లో ఒక్కో దఫా పెద్దమొత్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. దీంతో ఎక్కువ మందికి రక్తం అందించాల్సి రావడంతో అప్పుడప్పుడు కొరత ఏర్పడుతోంది. రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్

సేవలకు గుర్తింపు

జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌ను 27 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చారు. దాతలు అందించిన రక్తాన్ని కంపోనెంట్లుగా విడగొట్టి ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడే సాంకేతిక పరిజ్ఞానం ఇక్కడ ఉంది. దీని సేవలు రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. దేశంలో రెండో స్థానంలో నిలిచి గుర్తింపు పొందింది. కరోనా సమయంలో రోగులకు ప్లాస్మా దానం చేయడంలోనూ మొదటి స్థానాన్ని సంపాదించుకుంది.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

- కలెక్టరేట్ ఎదుట నిరసన


కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశావర్కర్ల నిరసన

నెల్లూరు(దర్గామిట్ట): కలిగిరి పీహెచ్‌సీ రావులకొల్లు ఆశావర్కర్ పందిటి విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా విజయమ్మ పనిచేస్తోందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించినట్లు చెప్పారు. ఆమెను విధుల్లోకి తీసుకోవడంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారన్నారు. గతంలో గండిపాళెం ఆస్పత్రి పరిధిలోని వేపూరుపల్లిలో ఆశావర్కర్ల విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓగా ధర్మరాజు బాధ్యతల స్వీకరణ


ధర్మరాజు

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీ శాఖ (టెరిటోరియల్) ఇన్‌చార్జి అధికారిగా ధర్మరాజు సోమవారం స్థానిక వేదాయపాళెంలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ప్రభుత్వం అనంతపురం జిల్లాకు బదిలీ చేసింది. నెల్లూరుకు ఇన్‌చార్జిగా చిత్తూరు జిల్లాకు చెందిన ధర్మరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన్ను పలువురు రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాణసంచా స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. పరమేశ్వరినగర్‌కు చెందిన కె.శ్రీనివాసులు పొర్లుకట్టలోని తన రేకుల ఇంట్లో బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచాడు. దీనిపై సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)


పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35

మోసగాళ్లపై చర్యలు తీసుకోండి

- బాధితుల వినతి


బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): రెట్టింపు నగదు ఇస్తామని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 105 మంది విచ్చేసి సమస్యలను వినతుల రూపంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు నగదు పేరుతో మోసం

నెల్లూరు రూరల్ మండలానికి చెందిన హసన్ అలియాస్ కార్తీక్ రూ.లక్ష నగదుకు మూడింతలు ఇస్తానని తమ వద్ద రూ.27.50 లక్షలు తీసుకుని మోసగించాడని, నగదు అడిగితే గ్యాంగ్‌తో చంపిస్తానని బెదిరిస్తున్నాడని పాముూరుకు చెందిన మల్లికార్జునరావు, గుంటూరు జిల్లాకు చెందిన గోవిందరావులు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని..

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.71 లక్షల నగదు తీసుకుని మోసగించిన ఆత్మకూరుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అదే ప్రాంతానికి చెందిన యువతి ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. అదేక్రమంలో నెల్లూరు నగరానికి చెందిన ప్రవీణ్ బెంగళూరు, హైదరాబాద్‌ల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.17 లక్షలు తీసుకుని మోసగించారని పలువురు బాధితులు వినతిపత్రాలు అందజేశారు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ముట్టడి

- ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయలేదని ఆగ్రహం


పోలీస్‌స్టేషన్ వద్ద మృతుడి బంధువుల ఆందోళన

గుడ్లూరు(కందుకూరు రూరల్): ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం రాత్రి జి.అశోక్ చక్రవర్తి అనే 12 ఏళ్ల బాలుడి కాలు తెగిపడి ఒంగోలులో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గుడ్లూరు మండలంలోని గుడ్లూరు–అడవిరాజుపాళెం గ్రామాల మధ్య జరిగిన ఈ ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. కానీ సోమవారం సాయంత్రం వరకు కేసు నమోదు చేయలేదు. ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలంటూ మృతదేహంతో బంధువులు, గ్రామస్తులు సుమారు 400 మంది పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. పోలీసులు ఆగ్రహించారు. దీంతో వారు, బాధితుల మధ్య కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రమాదంలో మృతుడి తల్లిదండ్రులు, డ్రైవర్‌కు గాయాలై చికిత్స పొందుతున్నారు. ఎస్సీలమనే కారణంతో పోలీసులు కేసును పక్కదారి పట్టిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్ కొండారెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. సీఐ మంగారావు, ఎస్సై వెంకట్రావు బాధితులతో చర్చలు జరిపారు.

ఆలయాల్లో చోరీలు చేసే ముఠా అరెస్ట్

- బంగారం, వెండి వస్తువులు, రూ.2 వేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, చిత్రంలో సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: గ్రామాల్లోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఐ జి.గంగాధర్, అనంతసాగరం ఎస్సై ఎం.సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి డీఎస్పీ పట్టణంలోని కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల అనంతసాగరం మండలంలోని పాతదేవరాయపల్లి గ్రామంలో పోలేరమ్మ, తుమ్మలమ్మ తదితర ఆరు గ్రామదేవతల దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన అనంతసాగరం మండలానికి చెందిన మానికల చెంచయ్య, చేజర్ల మండలం మాముడూరుకు చెందిన పొట్లూరి రమణయ్య, నాగలవెలటూరుకు చెందిన యాటగిరి కస్తూరి, ఆత్మకూరు మండలం కరటంపాడుకు చెందిన పొట్లూరు పెంచలయ్యను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని రూ.2 వేల నగదు, రూ.43 వేల విలువైన బంగారు, వెండి, చిన్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీల్లో 50 శాతం రికవరీ చేసినట్లు డీఎస్పీ వివరించారు. పొలాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవించే వీరు జల్సాలకు అలవాటు పడి ఆలయాల్లోని ఆభరణాలు, హుండీలను పగులగొట్టి నగదు దొంగతనానికి పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో ముఠా తిరుగుతున్నట్లు సమాచారం అందిందని త్వరలో వారిని పట్టుకుంటామన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 125	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ (లైవ్)	: 110	లేయర్ చికెన్	: 187
బ్రాయిలర్ చికెన్	: 224		

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి


సూర్యనారాయణ మృతదేహం

ఉలవపాడు: విద్యుత్ షాక్‌కు గురై ముఠా కూలీ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఉలవపాడు మండల పరిధిలోని ఆత్మకూరు – మన్నేటికోట గ్రామాల మధ్య సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఉలవపాడుకు చెందిన ఐదుగురు ముఠా కూలీలు లారీకి సరుగుడు కర్ర ఎత్తే పనికి వెళ్లారు. ఉలవపాడులో కొంత కర్ర లోడ్ చేసిన తర్వాత ఆత్మకూరు గ్రామంలోని మరో తోటకెళ్లారు. అయితే అక్కడ లారీ తిరిగే అవకాశం లేకపోవడంతో ఉలవపాడుకు బయలుదేరారు. ఆ సమయంలో మన్నేటికోట సమీపంలో రోడ్డుపైన ఉన్న విద్యుత్ తీగలు లారీలోని పచ్చికర్రకు తగిలాయి. ఈ విషయాన్ని గమనించిన క్యాబిన్‌లో ఉన్నవారు వెంటనే డోర్ పట్టుకోకుండా కిందకు దూకేశారు. కానీ ఉలవపాడుకు చెందిన గుంటక సూర్యనారాయణ (55) కిందకు దిగేందుకు డోర్ పక్కనున్న ఇనుప రాడ్ పట్టుకోగా షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై అంకమ్మ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ఎత్తులోనే..

విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. నెలరోజుల క్రితం కూడా ఇలాగే లారీకి తీగలు తగిలాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ రోడ్డు వెంబడి పొలాలు ఉండడం వల్ల సపోట, సరుగుడు, జామాయిల్ లోడ్ కోసం లారీలు తిరుగుతుంటాయి. అందువల్ల తీగల ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

